# ఆకస్మిక తనిఖీలు

**- రూ.1.15 లక్షలు పట్టివేత**



చించోలి(బి) చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్న నగదు

సారంగాపూర్, ఏప్రిల్ 20 : చించోలి(బి) చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. సారంగాపూర్ మండలం కౌట్ల(బి) గ్రామానికి చెందిన లక్ష్మణ్ తన వాహనంలో రూ.1.15 లక్షల నగదు తీసుకుని నిర్మల్ వైపు వెళ్తుండగా పట్టుకున్నారు. డబ్బులకు అనుమతి పత్రాలు లేకపోవడంతో నిర్మల్ కలెక్టర్ కార్యాలయానికి తరలించి ప్రత్యేక అధికారికి డిపాజిట్ చేశారు. అనుమతి లేకుండా డబ్బులు తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

# నిబంధనలు అమలు చేయాలి..



పోలీసులతో మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు వివేకానంద రాజేంద్ర

భైంసా, ఏప్రిల్ 20 : నిబంధనలు కఠినంగా అమలు చేయాలని పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకుడు వివేకానంద రాజేంద్ర అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్టీవో కార్యాలయ పలు చెక్‌పోస్టులను పరిశీలించి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల అభ్యర్థులు ప్రచార కార్యక్రమంలో భాగంగా చేసే ప్రతి ఖర్చును తప్పకుండా లెక్కించాలన్నారు.



కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్

# కేజీబీవీని తనిఖీ చేసిన కలెక్టర్

నర్సాపూర్(జి), ఏప్రిల్ 20 : నిర్మల్ జిల్లా నర్సాపూర్(జి) మండల కేంద్రములోని కస్తూర్బా విద్యాలయాన్ని శనివారం కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ తనిఖీ చేశారు. శుక్రవారం రాత్రి 11 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వంట గది, వాటర్ ట్యాంకును పరిశీలించారు. వంట చేసేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారని నిర్వాహకులను తెలుసుకున్నారు. వాటర్ ట్యాంకుపై మూత లేకపోవటంతో వెంటనే ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మిషన్ భగీరథ ట్యాంకుపైకి వెళ్లి నీటిని పరిశీలించారు. విద్యార్థులు తాగుతున్న మినరల్ వాటర్, వంటకు ఉపయోగించే బోర్ వాటర్‌ను పరిశీలన నిమిత్తం శాంపిల్స్ సేకరించారు. మిషన్ భగీరథ ట్యాంకు వద్ద పేరుకు పోయిన చెత్తను శుభ్రం చేయించాలని స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి వీణను ఆదేశించారు. జిల్లా విద్యాధికారి రవిందర్‌రెడ్డి, ఎంఈవో శంకర్, మిషన్ భగీరథ ఈఈ సందీప్, డీఈ గణేశ్, ఎంఆర్‌వో శ్రీనివాస్, డీఎంహెచ్‌వో ధన్‌రాజ్, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్‌గౌడ్ ఇన్‌చార్జి ఎస్‌వో వనిత ఉన్నారు.

### ఒకే నెలలో రెండు సార్లు

ఈనెల 3న కస్తూర్బా గాంధీ పాఠశాలలో రాత్రి వండిన పప్పును ఉదయం వడ్డించడంతో 20 మంది విద్యార్థులు వాంతులు చేసుకుని అస్వస్థతకు గురయ్యారు. వీరికి నిర్మల్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స అందించారు. తమ పిల్లల గురించి పాఠశాల సిబ్బంది ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అప్పుడు విచారణ అనంతరం ఎస్‌వో సునీత, హెడ్ కుక్ పద్మ, అకౌంటెంట్ మౌనికలను సస్పెండ్ చేశారు.

### ఆగని అస్వస్థతలు

కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఏప్రిల్ నెలలోనే రెండు సార్లు ఫుడ్ పాయిజన్ ఘటనలు పునరావృతం కావడంతో విద్యార్థుల ఆరోగ్యానికి రక్షణ కరువైందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### సహాయ వంట మనుషుల తొలిగింపు

కేజీబీవీ ఘటనకు సంబంధించి చర్యలు తీసుకోవడం జరిగిందని నిర్మల్ జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విధుల్లో నిర్లక్ష్యం వహించిన జ్యోతి, అనూష, ఉమ సహాయ వంట మనుషులను తొలగించినట్లు పేర్కొన్నారు.

### కోలుకుంటున్న విద్యార్థులు

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 20 : నర్సాపూర్(జి) కేజీబీవీ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కారణంగా పది మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వీరిలో మౌనిక, వినంతి, ఆరాధ్య తీవ్ర అస్వస్థతకు గురికావడంతో నిర్మల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రస్తుతం విద్యార్థులు కోలుకుంటున్నారని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఒకరిని డిశ్చార్జి చేయగా ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.



నిర్మల్ దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థిని



ట్యాంకులోని నీటిని పరిశీలిస్తూ..

# మాజీ మంత్రి జోగు రామన్న పర్యటన

తాంసి, ఏప్రిల్ 20 : తాంసి మండలంలోని కప్పర్ల గ్రామంలో శనివారం మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటించారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామాన్ని సందర్శించారు. బీఆర్‌ఎస్ నాయకులు గడ్డం స్వామి తండ్రి ఇటీవలే మృతి చెందాడు. వారి కుటుంబాన్ని పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వారి వెంట ఎంపీపీలు నిమ్మల ప్రీతం రెడ్డి, తుల శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ నాగయ్య, వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న ఉన్నారు.



పిప్పల్‌కోటిలో పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ మంత్రి జోగు రామన్న

# బాధితులకు అండగా సఖీ కేంద్రం

ఎదులాపురం, ఏప్రిల్ 20 : బాధితులకు అండగా సఖీ కేంద్రం ఉంటుందని సఖీ కేంద్రం సైకో సోషల్ కౌన్సిలర్ లావణ్య అన్నారు. శనివారం సఖీ కేంద్రం ఆధ్వర్యంలో మావల పరిధిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు, ఎస్సీ, బీసీ, స్టడీ సర్కిల్‌లో శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులు, ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సఖీ కేంద్రం ద్వారా కౌన్సెలింగ్, న్యాయ సహాయం, పోలీస్ సహాయం, వైద్య సహాయం, తాత్కాలిక వసతి కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గృహహింస, బాల్యవివాహాల చట్టం, పోక్సో చట్టం, సైబర్‌క్రైమ్‌పై అవగాహన కల్పించారు. సఖీ కేంద్రానికి వచ్చిన బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. అత్యవసర సమయంలో 181, 100, 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ యశోద, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సఖీ కేంద్రం సైకో సోషల్ కౌన్సిలర్ లావణ్య



నివాళులర్పిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ మంత్రి రామన్న, భూక్యా జాన్సన్ నాయక్





అమరవీరులకు నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

# ఇంద్రవెల్లి అమరులకు నివాళి

**● సంప్రదాయబద్ధంగా శ్రద్ధాంజలి ఘటించిన ఆదివాసులు ● నివాళులర్పించిన మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు, ప్రముఖులు**

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 20 : ఇంద్రవెల్లి మండలంలోని హీరాపూర్ గ్రామ సమీపంలో గల అమరవీరుల స్తూపం వద్ద అమరవీరుల ఆశయ సాధన కమిటీ, ఆదివాసీ గిరిజనుల ఆధ్వర్యంలో స్వేచ్ఛగా నివాళులర్పించారు. ఏప్రిల్ 20, 1981లో పోలీసు కాల్పుల్లో అమరులైన వీరులకు ఆదివాసీ గిరిజనులు తమ సంస్కృతీ సంప్రదాయబద్ధంగా శనివారం ప్రత్యేక పూజలు చేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఉమ్మడి జిల్లాలోని ఆయా మండలాలతోపాటు వివిధ ప్రాంతాల నుంచి ఆదివాసీ గిరిజనులు ఉదయం 10 గంటలకు స్తూపం వద్దకు చేరుకున్నారు. గోండ్‌గూడ నుంచి ప్రారంభమైన ర్యాలీ మండల కేంద్రంలో గుండా అమరవీరుల స్తూపం వద్దకు చేరుకుంది. ముందుగా అమరవీరుల పేరిట జెండాను ఆవిష్కరించారు. అనంతరం సంప్రదాయ పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. అమరవీరుల స్తూపంతోపాటు జెండాల వద్ద సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించి, అమరవీరుల కుటుంబ సభ్యులతోపాటు ఆదివాసులు నివాళులర్పించారు.

### తొడసం ఖట్టికి నివాళులు

ఆదివాసీ గిరిజన హక్కుల కోసం పోరాటాలు చేసి మృతి చెందిన తొడసం ఖట్టికి తుమ్మగూడ గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజనుల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మండలంలోని తుమ్మగూడ గ్రామస్తుల ఆధ్వర్యంలో సమక ఎక్స్‌రోడ్డు వద్ద ఖట్టి స్మారకార్థం ఏర్పాటు చేసిన జెండాను ఆవిష్కరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఆదివాసీ గిరిజనులు మాట్లాడారు. ఆదివాసీ గిరిజనుల కోసం ఆయన ఉద్యమాలు చేశారన్నారు. గిరిజనుల హక్కుల కోసం ఉద్యమాలు చేసిన తొడసం ఖట్టిని అప్పటి పోలీసులు హైద్రాబాద్‌లోని చంచల్‌గూడ జైల్‌లో ఆరేండ్లు నిర్బంధించారన్నారు. యేటా ఏప్రిల్ 20వ తేదీన సంస్మరణ దినంగా నిర్వహిస్తున్నామన్నారు.

### నివాళులర్పించిన ప్రముఖులు

శిశు సంక్షేమ శాఖ, ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, బీఆర్‌ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, బీఆర్‌ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, మాజీ ఎంపీ సోయం బాపురావ్, బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగణ, బీఆర్‌ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ భూక్యా జాన్సన్ నాయక్, రాయిసెంటర్ల సార్‌మేడిలు మెస్రం వెంకట్‌రావ్ పటేల్, మెస్రం చిన్ను పటేల్, మెస్రం దుర్గు, జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు మహ్మద్ అబ్దుల్ అంజద్, జడ్పీటీసీలు ఆర్కా పుష్పలత, తుడుందెబ్బ మహిళా సంఘం అధ్యక్షురాలు పెందూర్ పుష్పరాణి, ఆదివాసీ గిరిజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సీడాం భీంరావ్, తుడుందెబ్బ గౌరవ అధ్యక్షుడు ఆర్కా ఖమ్ము, అమరవీరుల ఆశయ సాధన కమిటీ అధ్యక్షుడు తొడసం నాగోరావ్, ప్రధాన కార్యదర్శి మెస్రం నాగ్‌నాథ్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్కా బాపురావ్, తుడుందెబ్బ మండలాధ్యక్షుడు జుగ్నాక్ భారత్, ఆదివాసీ పురోహిత్ ప్రధాన్ సమాజ్ మాజీ మండల అధ్యక్షుడు సోయం రామ్‌దాస్, మాజీ ఎంపీపీ కనక తుకారామ్, ఎంపీటీసీలు మడావి భీంరావ్, కోవ రాజేశ్వర్, మాజీ సర్పంచ్ కోరెంగా సుంకట్‌రావ్, ఆదివాసీ సంఘాల నాయకులు కనక హనుమంత్‌రావ్, మెస్రం ఆనంద్‌రావ్, కనక తులసీరామ్, ముకాడే ఉత్తమ్, మానిక్‌రావ్, రాజ్‌వర్ధన్, దిలీప్‌మోరే, రాజలింగు, మరప రాజు, కొడప నగేశ్, పుర్కా చిత్రు అమరవీరులకు నివాళులు అర్పించారు.



అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఆదివాసీ గిరిజన మహిళలు

### స్తూపం వద్ద భారీ బందోబస్తు

అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ గౌడ్‌తోపాటు ఉట్నూర్ సీఐ మొగిలి, ఇంద్రవెల్లి ఎస్‌ఐ సునీల్ ఆధ్వర్యంలో స్తూపంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అమరవీరుల స్తూపం వద్ద అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. స్తూపంతోపాటు ప్రభావిత ప్రాంతంలోని గ్రామాల్లో ప్రత్యేక పోలీస్ బలగాలను ఏర్పాటు బందోబస్తును పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



కుంటాల : కల్లూరులో లేచిపోయిన ఓ ఇంటి పైకప్పు



రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు తొలగిస్తున్న డ్రైవర్, కండక్టర్, ప్రయాణికులు

# అకాల వర్షం.. అపార నష్టం..

**● జొన్న, మక్క, వరి పంటలకు తీవ్రనష్టం ● గాలి బీభత్సానికి లేచిపోయిన ఇంటి పైకప్పులు**
**● కూలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ● ఆందోళనలో అన్నదాతలు.. ● ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు**

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 20 : ఆదిలాబాద్-నిర్మల్ జిల్లాల్లో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి రైతులు తీవ్రనష్టాన్ని చవిచూశారు. సుమారు గంటసేపు వర్షం కురియడంతో మొక్కజొన్న, జొన్న, నువ్వులు, పొద్దుతిరుగుడు, వరి, మిర్చి పంటలు చేతికొస్తున్న దశలో తడిసి నేలవాలాయి. మామిడి పంటకు కూడా నష్టం వాటిల్లింది. ఇప్పటికే జొన్న, మక్క, వరి పంటలు అమ్ముకోవడానికి కల్లాల్లో ఆరబోస్తుండగా వర్షం కారణంగా తడిసి రంగు మారాయి. నిర్మల్, దిలావర్‌పూర్, నర్సాపూర్, కుంటాల, లోకేశ్వరం, సారంగాపూర్ ప్రాంతాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



కుంటాల : ఓలాలో అకాల వర్షానికి తడిసిపోయిన కోసిన జొన్న

### కుంటాల మండలంలో..

కుంటాల, ఏప్రిల్ 20 : శనివారం వేకువజామున ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి కల్లూరులోని ఓ ఇంటి పైకప్పు రేకులు లేచిపోయాయి. దీంతో రాత్రి బిక్కు బిక్కుమంటూ గడపాల్సి వచ్చిందని బాధితులు వాపోయారు. ధ్వంసమైన ఇంటికి నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వ ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

### పంట నష్టం..

మండలంలోని కుంటాల, పెంచికల్‌పాడ్, విట్టాపూర్, ఓలా, అందకూర్, కల్లూర్ గ్రామాల్లో జొన్న, నువ్వు పంటలు నేలకొరిగాయి. ఆరబెట్టిన మొక్కజొన్న తడిసి ముద్దయింది. అందకూర్‌లో మూడు విద్యుత్ స్తంభాలు, ఒక ట్రాన్స్‌ఫార్మర్ నేలకొరిగాయి. విద్యుత్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని వినియోగదారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ధ్వంసమైన వాటికి మరమ్మతులు చేపడుతున్నట్లు ఏఈ శివప్రసాద్ తెలిపారు.

### భీంపూర్ మండలంలో..

తాంసి(భీంపూర్), ఏప్రిల్ 20 : ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని భగవాన్‌పుర, గుబ్డితోపాటు పలు గ్రామాల్లో శనివారం తెల్లవారు జామున గాలివాన బీభత్సం సృష్టించింది. భగవాన్‌పురలో గెడం అజయ్ ఇంటి పైకప్పుతోపాటు మరో నాలుగు ఇండ్ల పైకప్పులు లేచి కిందపడ్డాయి. విద్యుత్ స్తంభం పడిపోయింది. దీంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

### రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లు

తాంసి(భీంపూర్), ఏప్రిల్ 20 : భీంపూర్ మండలంలో శుక్రవారం రాత్రి గాలివానకు ఆదిలాబాద్-కరంజి(టీ) రోడ్డులో అడ్డంగా చెట్లు విరిగిపడ్డాయి. ధనోరా శివారులో రోడ్డుపై అలా అడ్డంగా ఉన్న చెట్లను డ్రైవర్, కండక్టర్, ప్రయాణికులు తొలగించుకుంటూ ప్రయాణం సాగించారు.

# బియ్యాన్ని సకాలంలో అందించాలి..



అర్లీలోని రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న కలెక్టర్

కుంటాల, ఏప్రిల్ 20 : కస్టం మిల్డ్ రైస్(సీఎంఆర్)ను ప్రభుత్వానికి సకాలంలో అందించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ మిల్లర్లకు సూచించారు. శనివారం ఆయన మండలంలోని అర్లీ క్రాస్ రోడ్డు వద్ద గల రైస్‌మిల్లును తనిఖీ చేశారు. ఈ రైస్‌మిల్ ఇప్పటివరకు 203 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అందించగా.. ఇంకా 90 శాతం సీఎంఆర్‌ను డెలవరీ చేయాల్సి ఉంది. మిగతా బియ్యాన్ని త్వరగా అందించాలని మిల్లర్‌ను ఆదేశించారు. ఆయన వెంట జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి నందిని, రైస్ మిల్ ఇన్‌చార్జి నర్సింహారెడ్డి, తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్, ఆర్ఐ అడెల్లు ఉన్నారు.

### బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు

భైంసా, ఏప్రిల్ 20 : పట్టణంలోని వివేకానంద చౌరస్తా వద్ద ఓ షాపులో అక్రమంగా నిల్వ ఉన్న ఏడున్నర క్వింటాళ్ల బియ్యాన్ని పట్టణ సీఐ రాజారెడ్డి శనివారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా బియ్యం నిల్వ ఉంచరాదన్నారు.

### దాఖలు కాని నామినేషన్

ఎదులాపురం, ఏప్రిల్ 20 : ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి శనివారం ఒక్క నామినేషన్ కూడా రాలేదు. మూడో రోజైన శనివారం నామినేషన్‌లు స్వీకరించగా ఎవరు దాఖలు చేయలేదని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు.

# సీ-విజిల్

**● నిబంధనలు ఉల్లంఘనపై ఫిర్యాదు చేసే అవకాశం**
**● ప్రజలు స్పందిస్తే ప్రయోజనం**




సీ-విజిల్ యాప్

ఆదిలాబాద్, ఏప్రిల్ 20(నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల నిబంధనల అమలులో భాగంగా ఎలక్షన్ కమిషన్ పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పార్టీలు, పోటీచేసే అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే చర్యలు తీసుకునేందుకు ఎన్నికల సంఘం సీ-విజిల్ యాప్‌ను అమలులోకి తీసుకొచ్చింది. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన పార్టీలు, నాయకులపై ప్రజలు ఈ యాప్ ద్వారా అధికారులకు ఫిర్యాదు చేసే అవకాశం కల్పించింది. పారదర్శక సేవలు అందించడానికి, అవినీతిని నియంత్రించడానికి ఏర్పాటు చేసిన ఈ యాప్‌ను ప్రజలు వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఈ యాప్ గురించి విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలు సీ-విజిల్‌లో కచ్చితమైన సమాచారం అందచేసి సక్రమంగా వినియోగించుకోవాలని సూచిస్తున్నారు.

### ఆధారాలతో ఫిర్యాదు చేయాలి..

సీ-విజిల్ యాప్‌లో ఫొటోలు, వీడియోలతో ఫిర్యాదులు చేయాలి. ఓటర్లను మభ్యపెట్టడానికి రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు అక్రమంగా నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీ, గిఫ్ట్‌లు, కూపన్ల పంపిణీ, అనుమతి లేని పోస్టర్లు, బ్యానర్ల పంపిణీ, పెయిడ్ న్యూస్, భయపెట్టడం, ప్రలోభ పెట్టడం, కాన్వాయ్ అనుమతి కంటే ఎక్కువ వాహనాలు వెళ్లడం, ప్రభుత్వ భవనాలు, స్థలాల్లో ఎన్నికల సామగ్రి ఉంచడం, ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీసి సీ-విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తే ఎన్నికల అధికారులకు చేరుతాయి. ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో అధికారులు సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటారు.

### ఫిర్యాదు ఎలా..

స్మార్ట్‌ఫోన్‌లో సీ-విజిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో మన వివరాలతో లాగిన్ కావాలి. ఫిర్యాదులకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ చేసి అందుకు సంబంధించిన వివరాలు తెలియజేయాలి. అప్‌లోడ్ చేసే సమయంలో జీపీఎస్ ఆన్‌చేసి ఉండాలి. ఫిర్యాదులు స్వీకరించిన అధికారులు లోకేషన్ ఆధారంగా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటారు. సీ-విజిల్ యాప్‌కు మంచి స్పందన ఉందని అధికారులు అంటున్నారు.



ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

# కొనుగోళ్లను వేగవంతం చేయాలి..

**రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్**

దస్తురాబాద్, ఏప్రిల్ 20 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ అన్నారు. శనివారం పెరకపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఇబ్బందుల్లేకుండా కొనుగోళ్లను చేపడుతామని పేర్కొన్నారు. తూకం చేసిన ధాన్యాన్ని గోదాములకు తరలించాలని సూచించారు. అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ధాన్యం బస్తాలపై టార్పాలిన్ కవర్లను కప్పాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, ఆర్ఐ గంగన్న, సీసీ లావణ్య ఉన్నారు.